# పావ

సామర్లకోట స్టేషన్ ప్లాట్ ఫారం మీదకు గర్జనలు చేసుకుంటూ మెయిల్ వచ్చి ఆగింది. అక్కడ రైలు ఏడెనిమిది నిముషాలకంటే ఎక్కువసేపాగదు. ఆగినా, ఆ సందడిలో ఆగినట్లు కనిపించదు. జనం హడావుడిగా, కంగారుగా అటూ యిటూ పరుగెత్తుతున్నారు. డిశంబర్ వెకేషన్ యివ్వటంవల్ల కాబోలు. కాకినాడలో చదివే మెడికల్ కాలేజీ విద్యార్థులు. యింజనీరింగ్ కాలేజి విద్యార్థులు ప్లాట్ ఫారంనిండా కిటకిటలాడుతున్నారు. వాళ్ళంతా అటూ యిటూ పరుగెత్తి తలా ఓ కంపార్ట్ మెంట్ లో ఎక్కేస్తున్నారు. గబగబా సామాన్లు చేరుస్తున్నారు.

డాక్టర్ ఇందిర చురుగ్గా ముందుకు నడిచి, ఓ ఫస్ట్ క్లాస్ కంపార్టుమెంట్ లో ఎక్కింది. ఆమెకు రిజర్వేషన్ లేదు. విజయవాడ వెళ్ళాలి. విజయవాడదాకా మెయిల్ కి రిజర్వేషన్ యివ్వరు. కాని, ఎనిమిదిగంటల లోపలే అక్కడికి చేరిపోతుంది కాబట్టి. అప్పటిదాకా కూర్చోవటానికి ప్రయాణీకు లెవరూ అభ్యంతర పెట్టరు.

అదృష్టం బాగుంది. ఆమెకి కిటికీ ప్రక్కనే సీటు చిక్కింది. కూర్చుని సగంవరకూ వేసివున్న లెక్క పూర్తిగా ఎత్తివేసి హాయిగా ఊపిరి పీల్చుకుంది. రైల్లో కిటికీదగ్గర కూర్చుని ప్రయాణం చెయ్యడం ఆమె కెంతో సరదా.

పోర్టర్ ఆమె సూట్ కేసు, బెడ్డింగు బెర్తు, క్రిందుగా పర్దె డబ్బులు తీసుకుని వెళ్ళిపోయాడు. డాక్టర్ ఇందిర వెనక్కి ఆనుకుని, విశ్రాంతిగా కూర్చుంది. ఆమె పూర్తి పేరు ఇందిరా ప్రియదర్శిని, మెడికల్ కాలేజీలో మైక్రోబయాలజీ డిపార్టుమెంటులో రీడర్ గా పని చేస్తోంది.

శీతాకాలపు మధ్యాహ్నం కావటంవల్ల ఆలేతఎండలో కాస్త చలికూడా మిళితమై వింత ఆహ్లాదాన్ని కల్గిస్తోంది. ఆమె కెదురుగా నడివయస్కులయిన యింగ్లీషు దంపతులు కూర్చుని వున్నారు. వాళ్ళ తాలూకు యిద్దరు పిల్లలు. ఇందిర కూర్చున్నవైపు ఫుల్ సూటులో వుండి ఆఫీసరుగా కన్పిస్తూన్న ఓ అతనూ, అతని భార్య కాబోలు, యిరవై అయిదేళ్ళ స్త్రీ కూర్చున్నారు. ఆమె ఎక్కినపుడు వాళ్ళు లేరు. ఇంచుమించు వెనువెంటనే ఎక్కారు.

ఇందిరవైపు పరిశీలనగా చూస్తూ "మీరు ఎక్కడిదాకా వెడుతున్నారు?" అనడిగాడు మర్యాదగానే, యింగ్లీషులో ఆఫీసరులా కనబడుతున్న ఆతను.

"బెజవాడ"

అతని ముఖం ఒకరకమైన ఆందోళన నుండి, నిశ్చింత లోకి మారింది. భార్యవైపు తిరిగి 'ఫర్వాలేదు' బెజవాడలో డిన్నర్ తీసుకున్నాక నేను పై బెర్తుమీదకి వెడతాను. నువ్వు క్రింద పడుకోవచ్చు" అన్నాడు.

భార్య తల ఊపింది.

స్టేషన్‌లో గంట కొట్టేశారు. గార్డు విజిల్ కూడా ఊదాడు. డీజిల్ యింజన్ గుండెలు ఝల్లుమనేటట్లు సైరన్ యిచ్చింది.

బహుశా తర్డుక్లాస్ పెట్టెలు చోటుచాలక కిటకిటా లాడుతూ వుండివుండాలి. ప్లాట్‌ఫారంమీద చాలామంది జనం ముఖాలు [వేలాడేసుకుని మిగిలిపోవటం కనిపిస్తోంది.

ఇంజను వైపునుంచి అదుర్దాగా పరుగిడుతూ ఒకతను వచ్చాడు. ముప్ఫయి ఏళ్ళ లోపు వుంటుందతని వయస్సు. బుజాలమీద చిన్న పాప పడుకుని నిద్రపోతోంది. బహుశా స్థలం కోసం అటూ యిటూ ఒకటిరెండుసార్లు తిరగటంవల్లనేమో, అతను కొంచంగా వగరుస్తున్నాడు. వేసుకున్న ప్యాంట్ స్లాక్ కొంచం మాసివున్నాయి.

సరిగ్గా ఇందిర కూర్చున్న కిటికీదగ్గర ఆగాడు. అతని ముఖంలో ఆందోళన కొట్టొచ్చినట్లు కనబడుతోంది. నిరాశా నిస్పృహాలతో అటూ యిటూ చూస్తున్నాడు.

రైలు కదలబోతున్నది.

చటుక్కున తల త్రిప్పి వెనక్కి చూశాడు ఇందిర కనిపించింది. ఏదో ఆలోచన వచ్చినట్లు అతని ముఖంలో ఆశా కిరణం తళుక్కుమన్నది.

"చూడండి" అన్నాడు తడబడే కంఠంతో. "నే నర్జంటుగా యీ రైలుకే వెళ్ళాలి. ఈ పాపతో ఏ పెట్టె లోనూ ఎక్కటానికి వీలుగాలేదు. మీరేం అనుకోకపోయినట్లయితే పాపను కాసేపు వుంచుకుంటారూ....? నే నెక్కడో ఎక్కేస్తాను"

ఇందిర అదిరిపడినట్లయింది, ఏమి సమాధానం చెప్పటానికి తోచలేదు.

ఆలోచించటానికి టైములేదు.

అతను జాలిగొల్పే కళ్ళతో అభ్యర్థిస్తున్నట్లుగా చూస్తున్నాడు. కాదనటానికి నోరు రావటంలేదు. కాని అతని కోరిక ఏమిటోగా, అసహజంగా వుంది.

"ఏమండి ! ఏమండీ !! ప్లీజ్!" అతను పాపను రెండు చేతుల్తో పట్టుకుని అందిస్తున్నట్లుగా ముందుకు చూస్తున్నాడు.

రైలు కదిలింది.

ఇందిరలోకూడా ఏదో కదిలింది. ఆమె అప్రయత్నంగా చేతులు జాచింది. "థాంక్సండీ" అని అరుస్తూ అతను పరుగెత్తుకుపోవటం, రైలు వేగం అందుకోవటం అన్నీ గబగబ జరిగిపోయాయి.

ఆమెకు అయోమయంగా, కలలో జరిగిపోయినట్లుగా వుంది. పాపను వొళ్ళో కూర్చోపెట్టుకుని, కిటికీలోంచి తల బయటపెట్టి ఆదుర్దాగా చూస్తోంది. అప్పటికప్పుడే రైలు ప్లాటుఫారం దాటిపోతోంది. ఆమె గుండె గబగబ కొట్టుకుంది. అతనే పెట్టెలో నైనా ఎక్కాడో, లేక స్టేషన్లో దిగబడిపోయాడో !'

మెయిల్ షుగర్ ఫ్యాక్టరీని దాటిపోతూండగా తల లోపలకు తీసుకుని మామూలుగా కూర్చుంది. అప్పుడు చూసింది పాప ముఖంలోకి.

ఆమె హృదయంమీద తలవాల్చి నిశ్చింతగా నిద్రపోతున్నది. పాప. నిద్దట్లో ఎవరిచేతుల్లోంచి ఎవరి చేతుల్లోకి మారిందో తెలియదు....ఏడెనిమిది నెలలలోపే వుంటుంది. తెల్లగా కొంచం బొద్దుగా అందంగా వుంది. చిన్న పెదవులు. కొరికి వెయ్యాలనిపించేటంత సొంపుగా వున్న గులాబీరంగు

బుగ్గలు, మహా అమాయకంగా నిద్రతూ వుంది, చిన్న లాగూ వేసుకుని మామూలుగా గౌను వేసుకుని వుంది. అవికూడా కొంచం మాసివున్నాయి.

పాప ముఖంలోకి చూస్తూ కొన్నిక్షణాలు తనున్న సమస్య మరిచిపోయింది ఇందిర.

"నేనైతే యిలాంటి పని చెయ్యటానికి ఒప్పుకోను."

ఇందిర ఉలికిపడి, తల ప్రక్కకుతిప్పి చూసింది ఆఫీసరు గారి భార్య అంటున్నది.

తను మంచిపని చేశానని ఇందిర కూడా అనుకోవటం లేదు. కాని మరొకరు ఆ విషయం సూచించేసరికి ఆమె సుముఖురాలు కాలేకపోయింది. తన మనసులోని విషయానికి ఎత్తిపొడుపుకలిగి మరొకరు బయట పెట్టడం, ఆమెకి రుచించదు.

"తప్పేం?" అని అందామనుకుని, తమాయించుకుని" అనుకోకుండా జరిగిపోయింది." అన్నది.

"మీరు చాలా మొహమాటస్తులను కుంటాను"

ఇందిర ఏమీ మాట్లాడలేదు. నవ్వి ఊరుకుంది.

వొడిలో పాప నిర్మలంగా నిద్రపోతున్నది.

"పాప బాగుంది కదూ!" అంది ఇందిర అప్రయత్నంగా.

ఆఫీసరుగారి భార్య పెదవివిర్చి "మీరు యీ మాత్రానికే ఆశ్చర్యపోతున్నారా? అయితే మా పిల్లల్ని చూస్తే వదిలి పెట్టేవారు కాదు" అంది.

ఏరీ మీ పిల్లలు? మీతో తీసుకురావటంలేదా?"

ఆఫీసరుగారి భార్య ముందుగా నవ్వింది,

నేను పిల్లల్ని నాతో వుంచుకోను, లైఫ్ ఫ్రీగా వుండక పోవటమలావుంచి, వాళ్ళు చెడిపోతారు కూడాను. మన దగ్గరవుంటే డిసిప్లిన్ రాదు. మా అబ్బాయికి ఆరేళ్ళు! హైదరాబాద్ పబ్లిక్ స్కూల్లో చేర్పించాను. అమ్మాయికి మూడేళ్ళు, మా అమ్మగారింట్లో వుంచేశాను.

"తర్వాత....?"

"అంతే యిహావుండరు" అంటూ ఆమె మళ్ళీ నవ్వింది.

ఒక నిముషమాగి "మీ విషయం చెప్పండి" అన్నది.

"నాకు పెళ్ళికాలేదు" అంది ఇందిర అయిష్టంగానే.

ఆఫీసరుగారి భార్య ముఖంలో ఆశ్చర్యం పొడసూ పింది. తర్వాత "మీరెక్కడ వుంటారు? ఏం చేస్తారు?" వగైరా వగైరా ప్రశ్నలన్నీ అడిగింది. ఇందిర అన్నిటికి ఓపిగ్గా సమాధానం చెప్పింది. రైల్లో అపరిచితులైన ప్రయాణీకులతో ఏవేవో మాట్లాడటం, కబుర్లు పెంచుకోవటం చేతకాదు. ఏదైనా పుస్తకం చదువుకుంటూనో లేక గంటల తరబడి ఆలోచిస్తూనో కాలం గడిపేస్తుంది. ఆలోచన ఆమె ముఖ్యమైన హాబీ.

ఇందిర అక్కడపోయిన ఆఫీసరుగారి భార్య తన కబ్బీళ్ళన్నీ చెప్పింది. తనపేరు సుధారాణి. మద్రాస్ ప్రెసిడెన్సీ కాలేజిలో బి. ఎ. వరకూ చదువుకుంది. తర్వాత పెళ్ళయాక చదువుకు ఉద్వాసనచెప్పి, సంసారంలో పడింది. భర్త ఎలక్ట్రికల్ సైడ్ కాకినాడలో ఛీఫ్ ఇంజనీరు, తాము ప్రస్తుతం వారంరోజులు సెలవుమీద మద్రాస్ వెడుతున్నారు.

ఇంతలో ఆమె భర్త ఆమె నెందుకో పిలిచాడు. ఇందిరని విడిచిపెట్టి ఆయన్తో కబుర్లతో పడింది.

ఇందిరకు తన పరిస్థితి ఏమీ సుఖంగా లేదు. ఎదురుగా కూర్చున్న ఇంగ్లీషు దంపతులు కూడా మధ్యమధ్య తనవంక చోద్యంగా చూస్తున్నారు.

పిచ్చివేగంతో, పెద్దగా చప్పుడు చేసుకుంటూ మెయిలు ముందుకు దూసుకుపోతున్నది. అంత వేగంగా పోతుంది కాబట్టి ఇందిరకు మెయిల్‌లో ప్రయాణం చేయటమంటే ఆమెకు సరదా, నిదానంమీద ఆమెకు అసహ్యం తన జీవితమన్నా అందుకే అసహ్యం-అంత నిదానం వుంటుంది కాబట్టి.

తాను కాస్త ప్రక్కకు జరిగి చోటుచేసి పాపను బెర్త్ మీద పడుకోపెడదామా అనుకుంది. కాని మళ్ళీ వెంటనే భయం వేసింది, ఆ కదలికకు పాపలేచి ఏడుపు మొదలు పెడతే? ఎవరు ఊరుకోబెడతారు? తనవల్ల నవుతుందా?

త్వరగా రాజమండ్రి స్టేషన్ వస్తే బాగుండును. అతను త్వరగావచ్చి తన పాపను తీసుకువెళ్ళిపోతే బాగుండును.

ముక్కూ మొహం తెలియని వారిపాపని, తప్పనిసరిగ్గా వొళ్ళో అంతసేపు పడుకోబెట్టుకోవటం ఆమెకు చిరాగ్గావుంది. అవమానంగానూ వుంది. నిస్సహాయతతోకూడిన అహం మనిషిని దహిస్తోంది.

ఇంగ్లీషు దంపతులు తమలోతాము ఏవేవో మాట్లాడుకుంటున్నారు. మధ్యమధ్య పిల్లలడిగిన ప్రశ్నలకు ఒపిగ్గా సమాధానాలు చెబుతున్నారు. ఇంజనీరు గారికీ, ఆయన భార్యకీ కబుర్ల కంతులేకుండా వుంది.

నిముషాలు గడిచిపోతున్నాయి.

ఆడవుల్లాంటి ప్రదేశం మాయమై, బయట మేడలూ-యిళ్ళూ, దూరంగా అటూ యిటూ తిరిగే గళ్ళూ, కార్లూ గోచరించసాగాయి.

రాజమండ్రి సమీపిస్తోంది. హమయ్యా: ఇందిర ముఖం వికసించింది.

హఠాత్తుగా రైలు వేగం తగ్గింది. మరో కొద్ది సేపట్లో ప్లాటుఫారం మీదకు వచ్చి ఆగింది.

మళ్ళీ సందడి. ఎక్కే-దిగే జనం. కాఫీ, టీ, తినుబండారాలు అమ్మేవాళ్ళ కేకలు, టికెట్ కలెక్టరు హడావుడే, చిరుతిండి కోసం రైల్లోంచి దిగిన ప్రయాణీకులు ప్రదర్శించే తహ తహ....

ఇందిరకు యివన్నీ పట్టలేదు. కిటికీలోంచి తల బయటకు పెట్టి అతనికోసం ఆతృతగా చూస్తోంది. కళ్ళుచించుకుని నిశితంగా ఆశగా తమ పెట్టెవైపు వస్తున్న ప్రతి మనిషినీ పరిశీలిస్తోంది. అంతలో ఆమె ఆశ చెదిరిపోతున్నది.

క్షణాలు గడిచినకొద్ది ఆమెలో నమ్మకం నశించి, నిస్పృహ ఆవరిస్తోంది.

దీనికితోడు "ఏమండీ వచ్చాడా!" అనడుగుతోంది లోపల్నుంచి సుధారాణి. ఆమె ప్రశ్న వెక్కిరింపుగా ధ్వనించింది ఆమె ఏమీ జవాబు చెప్పలేదు.

ఎదురుగా కూర్చున్న యింగ్లీషు కుటుంబం యిదివరకే ఆర్డర్ చేశారులావుంది. బ్రెడ్, బటర్, జామ్ - యింకేవేవో వచ్చాయి. వాటిని ఆప్యాయంగా తింటున్నారు.

ఇంజనీరుగారూ, సుధారాణికూడా ట్రేలో కాఫీ తెప్పించుకున్నారు. "ఏమండీ కాఫీ త్రాగరా?" అనడిగింది ఆమె ఇందిరను !

"వద్దండి యిప్పుడు తాగను" అని మృదువుగా తిరస్కరించింది.

కాలం గడిచినకొద్దీ ఆమెకు కళ్ళ నీళ్ళ పర్యంత మవుతోంది. రైలాగి యింతసేపయితే అతనెందుకురాడు? కావాలని యీ పిల్లని తన కంటగట్టి పలాయనం చిత్తగించాడా? తనని మోసం చేశాడా?

ఈ ఆలోచన రాగానే ఆమె వళ్లు ఝల్లుమంది.

అలా జరిగినట్లయితే తనేం చెయ్యాలి? పోలీసులకి రిపోర్టు చెయ్యాలా? పోలీసు స్టేషన్ తను కూర్చున్న కంపార్టుమెంటుకు ఎదురుగానే కనిపిస్తోంది. రిపోర్టు చేస్తే తనమాటలు నమ్ముతారు. ఎందుకంటే తనకి సాక్ష్యం వుంది. కాని పోలీసులు ఏం చేస్తారు వెంటనే?

పాపను హేండ్ వోవర్ చేసుకుని, తనని పంపించేస్తారేమో! అవును. అలా జరిగితేనే నయం. ఎవరికో చెందిన యీ పాపను కాపాడటానికి తనకేం పట్టింది? తన కెందుకు జాలి ?

ఎదురుగా పోలీసు స్టేషన్ ఆహ్వానిస్తున్నట్లు కనబడింది. లేవబోయింది, లేవబోతూ పాప ముఖంలోకి చూచింది

వెంటనే ఆమె శరీరం కదలటానికి నిరాకరించింది.

అందాల పాప, అమాయకంగా నిద్రపోయే పాప, లేత పాప. పోలీసుల వాతపడెయ్యటానికి చేతులొస్తున్నాయా తనకు ? అంత కఠినురాలా తను ?

ఏం చెయ్యటానికీ తోచక దిగులుగా, కంగారుగా నిస్సత్తువగ ఉంది.

పోనీ క్రిందకి దిగి అన్ని పెట్టెలూ వెదికి అతనెక్కడున్నాడో వెతికితే?

అవును. ఈ ఆలోచన బాగుంది. ఆమె పాపను భుజం మీద కెత్తుకుని లేవబోయింది.

కెవ్వుమంది పాప. ఉలికిపడి లేచిందేమో. గుక్కపట్టినట్లుగా ఏడుస్తోంది.

ఇందిర గుండె ఆగిపోయినంత పనయింది. తిరిగి సీటులో కూలబడిపోయింది.

ఇందాకటి నుంచీ భయపడుతూన్న సమస్య యెదుర యింది? యెలా పాపని ఊరుకోబెట్టటం? యెలా లాలించటం? ఆమెకు భయంగా ఉంది, సిగ్గుగా ఉంది. అభిమానంగా ఉంది, అవమానంగా ఉంది, అసహనంగా ఉంది.

కంపార్టుమెంటులో ఉన్న ఆ కాసిని మందీ తననే చూస్తున్నట్లూ, ఆ చూపులు గ్రుచ్చుకుంటున్నట్లూ -ఎలాగో ఉంది.

ఎలాగో ఉంది.

ఎందుకేడుస్తోంది? తన ముఖం వంకచూసి, ఆ కొత్తదనాన్ని ఒప్పుకోలేక జాలిగా ఏడుస్తోంది. కొంతమంది పిల్లలు ఏడుస్తూంటే మూతి కడుపు తరుక్కుపోయేలా కదుల్తుంది. ఈ పాప మూతి అలాగే కదుల్తోంది.

ఇందిరకు బలే జాలేస్తోంది. ఆకలేస్తుందేమో! పొట్ట లోపలికిపోయి వుంది

A Madhusudana Rao



అనుకోకుండానే అటూ యిటూ కదిలిస్తూ, ఆ భుజం మీదనుంచి ఈ భుజంమీదకూ, యిటునుంచి అటుమారుస్తూ, వెన్నుమీద తడుతో సముదాయించటానికి ప్రయత్నిస్తోంది.

"పాలు కావాలేమో" ఇంగ్లీషు దంపతుల్లో భార్య యింగ్లీషులో అంది.

"ఏమో."

అనేసి ఆలోచిస్తోంది. అంత కంతకూ పాపరాగం పెద్దదైపోతోంది.

"మిల్కుసార్ మిల్కు"

ప్లాటుఫారంమీద ఓ ట్రేలో పాలసీసాలు నిండాపెట్టుకుని ఒకతను అమ్ముతున్నాడు.

"పిలుద్దామా?" అనుకుంది. సంకోచంగా, అసహనంగా వుంది.

పాప ఏడుపు ఎక్కువ చేస్తోంది.

తప్పలేదు. ఇందిర ఆ పాలమ్మే అతన్ని పిలిచింది. ఒక సీసా తీసుకుంది, ఎలా పట్టటం? అయోమయంగా ఓసారి నలువైపులా చూసింది.

"స్పూన్ యిమ్మంటారా?" యిగ్లీషు ఆమె అంది.

"ఇవ్వండి" అన్నట్లు తల ఊపింది.

ఆమె చెంచా యిచ్చాక పాపను ఒళ్ళో పడుకోబెట్టుకుని. సీసాలోని పాలు చెంచాతో కొద్దికొద్దిగా పోస్తోంది. ఆకలిగావుంది గావును ఏడుపు మానేసి పాప హాయిగా తాగేస్తున్నది పాలు. గబగబ తాగేస్తున్నది.

పాప పాలుత్రాగటం పూర్తయేసరికి రైలు కదిలే టైమయింది. క్యాంటిన్ వాళ్ళు వచ్చి ఖాళీకప్పులు. ప్లేట్లూ వగైరాలు తీసుకెళ్ళిపోయారు.

"చూశారా ఎంత తిప్పలు పడవల్సి వచ్చిందో మీరు!"

ఇందిర తలత్రిప్పి చూసింది.

"నామాటవిని ఆ పోలీసు స్టేషన్‌లో పడేసిరండి. ఈ లేనిపోని బెడదంతా ఎందుకు మీకు" అంది సుధారాణి.

"పడేసిరాను" అందా మనుకుంది ఇందిర. అందామా వద్దా అని స్థిరపడే లోపున రైలు కదిలింది.

ఇందిర వొళ్ళో పాప కులాసాగా, ఉషారుగా ఆడుకొంటోంది. చేతులూ కాళ్ళూ ఒకటే కదిలిస్తోంది. మధ్యమధ్య ముఖంలోకిచూసి నవ్వుతోంది. దాన్ని పడిపోకుండా ఆపటం కష్టంగావుంది.

సుధారాణి మళ్ళీ భర్తతో కబుర్లలో పడింది. ఇంగ్లీషు కుటుంబం వాళ్ళ ధోరణిలో వాళ్ళు పడ్డారు. పాప ఆడుకొంటోంది.

ఇందిర....

ఆలోచిస్తోంది.

సంసార జీవితంలోని మాధుర్యం అనుభవించటానికి వ్యక్తి డాక్టరు అవడం అడ్డురాదు, అడ్డురాకూడదు.

మొదట్నుంచీ ఇందిర యాంత్రికపు మనిషికాదు. ఆమెలో కలలున్నాయి. ఆశలున్నాయి. ఆరాధనలున్నాయి.

ఎమ్. బి. యస్ మొదట్నుంచీ, ఫైనలియర్ పరీక్షలు రాసేవరకూ రఘు, ఆమె క్లాస్‌మేట్స్. బయటి జీవితంలో

ఎంతస్నేహితులో కాలేజి చదువులో యిద్దరిమధ్య అంతపోటీ వుండేది. ప్రతి సబ్జక్టులోనూ ఒకరు ఫస్టూ, యింకొకరు సెకండూ-యిలా బలాబలాలు తేల్చుకుంటూ వుండేవారు. ఈ పోటీతో మాధుర్యాన్నే అనుభవించేవారు గానీ, యిద్దరిలో అసూయలుండేవి కావు.

హౌస్ సర్జన్స కూడా యిద్దరూ కలసే చేశారు. విద్యార్థులుగా వున్నప్పుడు ఆడుకున్నట్లు యిప్పుడు దాగుడు మూతలాడుకోవటానికి వీలులేక పోయింది. ఒక వార్డులో గంటలు గంటలు గడపటం, నైట్ డ్యూటీలు, వంటరితనం, సన్నిహితతత్వం - యిద్దరూ ఒకరి కొకరు దొరికి పోయారు. బయటపడిపోయారు, మానసికంగా అల్లుకుపోయారు. చివరకు ఒకర్ని విడిచి ఒకరు ఒకరోజుకూడా గడపలేని స్థితికివచ్చారు.

హౌస్‌సర్జన్సీ అయిపోయాక పెళ్ళి చేసుకోవాలన్న నిర్ణయానికి వచ్చేశారు.

నేను ఎం. డి, నువ్వు ఎం. ఎస్ చదువుదామనుకున్నాం. మరి...."అన్నది ఇందిరా ప్రియదర్శిని.

"చదువుదాం. కాని అప్పటిదాకా పెళ్ళిచేసుకోకుండా వుండటంలో అర్థంలేదు. అదివరకటి సంగతేమోగానీ, యిప్పుడు నిన్ను నా దాన్ని చేసుకోకుండా ఎన్నో రోజులుండ లేను. మెడికల్ ఎడ్యుకేషన్‌లో వున్న డ్రాబాకేయిది. ఎక్కడో గడపాల్సిన క్షణాలు ఎక్కడో గడుపుతూ వుంటాం" అన్నాడు రఘు.

ఇందిర సిగ్గుతో తలవంచుకుంది. "ఐ ఎగ్రీవిత్ యు డియర్" అనుకుంది మనసులో ముగ్ధంగా.

హౌస్ సర్జన్సీ అయిపోయింది. ఇంకా కొద్దిరోజుల్లో పెళ్ళి అనుకున్నారు. పెద్దవాళ్ళు అంగీకారం యిచ్చేశారు.

ఆ సమయంలో ఇందిరకు జబ్బు చేసింది. విపరీతంగా కడుపులో నొప్పి వచ్చేసింది. తట్టుకోలేనంత బాధ. చివరకు అది సీరియస్‌గాకూడా పరిణమించేసరికి, హాస్పిటల్లో ఎడ్మిట్ చేయాల్సి వచ్చింది.

"తప్పదు, ఆమె ప్రాణం దక్కా-లంటే గర్భసంచీ తీసెయ్యాలి" అన్నారు డాక్టర్లు.

"ఏమయినా చెప్పండి. మా బిడ్డను బ్రతిమించండి" అన్నారామె తలిదండ్రులు.

"ఆమె పెళ్ళి చేసుకోవచ్చు. గారవాస్థ్య జీవితం గడుపవచ్చు. కాని సంతానం వుండదు."

"లేకపోతే మానె మా పిల్ల బాగుంటే అంతేచాలు, దాని ఆకారం మా ముందు మెసిలేటట్లు చేయండి. మాకు చాలు" అన్నారు తలిదండ్రులు ఏడుస్తూ.

ఆపరేషన్ జరిగింది. ఇందిర క్రమక్రమంగా కోలుకుని, తిరిగి ఆరోగ్యంగా తయారయింది.

రఘు ఆమెను చూడటానికి ప్రతిరోజూ వస్తున్నాడు. ఆమె ఆరోగ్యం కుదుడపడేదాకా తల్లడిల్లిపోయాడు. మనిషి దిగులుపడిపోయాడు.

ఆమెను యింటికి తీసుకువచ్చేశాక ఒ సాయంత్రం ఆమెను చూడటానికి ఎప్పటిలా వెళ్ళాడు. కాని మనిషి మాత్రం ఎప్పటీలాలేడు. భయంభయంగా వున్నాడు. ఎందుకనో బెదిరిపోతున్నాడు. మామూలుగా మాట్లాడలేకుండా వున్నాడు.

"నీతో ....ఒక విషయం చెప్పాలని వచ్చాను," అన్నాడు చివరకు.

"నాకు తెలుసు అదేదో" అన్నది ఇందిర చిరునవ్వుతో.

అతనదిరిపడి ఆమెవంక చూశాడు.

"నిన్ను పెళ్ళిచేసుకోవటల్లేదు" అని చెప్పటానికి వచ్చావు. మీ పేరెంట్సుకి నువ్వు ఒక్కడే కొడుకువి. నీబాధ నేనర్థం చేసుకోగలను. నువ్వు వృత్తిచేత డాక్టరువి. కాని మనిషివి, నీకు వంశాంకురం కావాలి. త్యాగంచేసే శక్తి నీకు లేదు. నీ వైపునుంచిచూస్తే అనవసరంకూడా. నీ దారికి అడ్డు రానులే రఘూ"

"నన్ను ....నన్ను క్షమించు ఇందిరా"

"ఎందుకు ? నాకు జరిగిన కీడుకా" వెళ్ళిరా రఘూ. ఇద్దరం పై చదువులు చదువుదాం. కాని ఒక ఊళ్ళోకాదు. అదంత బాగుండదు. మనం విడిపోదాం. గుడ్ బై"

ఎంతో తేలిగ్గా, హుందాగా, అట్టహాసంగా, ఆక్రందనలూ లేకుండా జరిగిపోయింది. ఆ దృశ్యం కలలోలా కదిలిపోయింది.

తర్వాత ఎంత బరువన్నా వుండుగాక-

* * *

వంటికేదో చల్లగా తగిలేసరికి కళ్ళు విప్పింది. పాప తన చీర తడిపేసింది.

ఎంత సిగ్గుపడిపోయిందో ఇందిర ? ఎవరన్నా చూశారేమోనని అటూ యిటూ చూసింది. ఇంజనీర్ గారి భార్య యీ

లోకంలో లేదుగాని యింగ్లీషుదంపతులు ఆమె ముఖంలోకి చూసి పక్కుమని నవ్వారు.

ఆమె ముఖం ఎర్రబడింది. ఏంచెయ్యాలో తెలియలేదు. పాప ఏడుస్తోంది. ముందుకువంగి సూటుకేసు తెరచి, అందులోంచి చిన్నటవల్ తీసింది. పాపలాగూ విప్పేసి టవల్‌తో వళ్ళంతా శుభ్రంగా తుడిచి, గౌనుకొంచెం క్రిందకు లాగింది.

సుధారాణి భర్తతో మాట్లాడుతున్నదల్లా యిటువైపు తిరిగి "ఎందుకోసమండీ మీకీ అవస్త అంతా?" అంది.

"అది మీకు అర్థంకాదు" అందామన్నంత దోషం వచ్చింది. కాని బలవంతాన నవ్వి ఊరుకుంది?

"తర్వాత నిడదవోలు స్టేషన్ వస్తుంది. స్టేషన్ మాస్టర్ని పిలిచి రిపోర్టు చేయండి" అని సలహా ఇచ్చింది సుధారాణి.

ఇందిర ఏమీ మాట్లాడలేదు.

పాప కొంతసేపు ఏడ్చి ఇందిర తప్పనిసరిమై జోకొట్టే సరికి మళ్ళీ నిద్రలో పడింది.

రైలు వేగం తగ్గింది.నిడదవోలు స్టేషన్ సమీపిస్తోంది.

ఇందిర గుండె గబగబ కొట్టుకుంటుంది. ఇక్కడయినా అతను కనిపిస్తాడో కనిపించడో! ఒకవేళ కనిపించకపోతే .... ఏ నిర్ణయం తీసుకోవాలో ఆమె కర్థం కావటంలేదు.

మెయిల్ స్టేషన్‌లో కొచ్చి ఆగింది. ఇందిర ఆతృతగా కిటికీలోంచి బయటకు చూస్తోంది.

"మీకు నిజంగా పిచ్చి - అతనిహరాడు. వెంటనే దిగి గార్డుకుగానీ, స్టేషన్ మాస్టర్‌కిగాని రిపోర్టు ఇవ్వండి" సుధారాణి వదిలిపెట్టకుండా సలహా నిస్తోంది.

ఇందిర పాపనెత్తుకుని లేచి నిలబడింది. ఆమె పాదాలు అప్రయత్నంగా తలుపు దగ్గరకు కదిలాయి.

కంపార్టుమెంటు దిగి ప్లాటుఫారం మీదకు వచ్చింది.

రైలు యిక్కడ యెక్కువసేపు ఆగదని ఆమెకు తెలుసు. ఏదో చెయ్యాలి, పాపని బుజంమీద వేసుకుని గబ గబ అడుగులు వేసింది. పాప ఆమె మెత్తని బుజంమీద తల వాల్చి బొమ్మలా పడుకునివుంది. తన స్టూడెంట్స్ ఎవరైనా, యీ రైల్లో ప్రయాణం చేస్తున్నారేమో, వాళ్ళుచూస్తే ఏమనుకుంటారోనని ఆమెకు చచ్చే సంకోచంగాఉంది. కాని తప్పదు. గబగబ ముందుకు నడుస్తోంది. తర్డు క్లాసు కంపార్టు మెంటులున్న చోటికి వచ్చింది. పెట్టెలు కిక్కిరిసి వున్నాయి. తలుపులు దగ్గర జనం గుంపుగా నిలబడి ఎక్కేవాళ్ళూ దిగే వాళ్ళూ త్రోసుకుంటున్నారు. గోలగా, భీభత్సంగా ఉంది. లోపలెవరున్నారో కనబడటం లేదు.

ఇందిరి హతాశురాలైంది. అతను తప్పకుండా తనని మోసం చేసి వుంటాడు.

నిస్పృహ వెనుదిరిగింది. నెమ్మదిగా అడుగులు వేస్తోంది. ఎదురుగుండా గార్డు కనిపించాడు. అతని దగ్గరకు వెళ్ళాలి. జరి గిందంతా చెప్పాలి. ఈ బరువు వదల్చుకోవాలి.

అతనివైపు కదలబోయింది. ఇంతలో ఆమెను ఎవరో చెయ్యిపట్టుకుని ఆపినట్లయింది.

ఇందిర ఆగిపోయింది. ఎవరూలేరు. ఊరికే భ్రమ అంతే. ఇంతలో బుజంమీద పాప కదిలి తల ఇటువైపు త్రిప్పింది. పాప ముఖం ఇందిర చెంపకు రాసుకోంటోంది.

ఆమె శరీరం పులకరించినట్లయింది. ఇహ గార్డువైపు కదలలేకపోయింది. వెళ్ళి ఏం చెబుతుంది? చెప్పి ఏంచేస్తుంది? అందాలుచిందే యీ అమాయకపు ముద్దను తీసుకువెళ్ళి పరాయివాడి చేతిలో పెట్టేస్తుందా? తనకు చేతులొస్తాయా?

"అట్లయితే తానుమాత్రం పరాయిదికాదా? ఈ పాపతో సంబంధం ఏర్పడి కొన్ని గంటలైనా కాలేదు. ఆ మాత్రం దానికి సొంతమనిషి అయిపోయిందా?

"అవును, అనుకోవటం కొంచం హాస్యాస్పదంగా, అతిశయోక్తిగా వుంది. అహం కూడా అడ్డువస్తోంది.

కాదనుకోవటానికి ధైర్యం చాలటంలేదు.

ఆత్మీయత కాదులే పోనీ మానవత్వం అని సరిపెట్టుకోవాలని చూసింది.

ఇంతలో పాప తన రెండుచేతుల్తో ఆమె కంఠం చుట్టేసింది. ముఖంలోకి చూసేసరికి ఎర్రని పెదాలు, మరింత అందంగా కనిపించేటట్లు నవ్వేస్తూంది.

ఆ సమయంలో పాపని, అలా ప్లాట్‌ఫారంమీద నిల్చుని గుండెలకు హత్తుకోవాలనీ, దాని చిన్నారి బుగ్గలమీద తనివి తీరా ముద్దుపెట్టుకోవాలనీ ఆమెకు బలవత్తరమైన కోరిక కలిగింది.

కాని ఎలా? చుట్టూవుండే జనం చూస్తారు. చూస్తే నష్టంలేదు కాని తనకే యేలాగో వుంటుంది. కంపార్టుమెంటులో అయితే సుధారాణి చూస్తుంది. ఆ ఇంగ్లీషువాళ్ళు చూస్తారు.

ఎందుకనో .... అది పిచ్చికావచ్చు. భ్రమకావచ్చు. వ్యామోహం కావచ్చు.

"ఈ పాప నాది" అనిపించింది ఇందిరా ప్రియదర్శినికి.

స్టేషన్ లో ఎప్పుడు గంట కొట్టారో తెలియదు. గార్డు విజిల్ వూదటం వినిపించింది. తడబడే అడుగుల్తో నడిచి పెట్టెలోకి వచ్చి చేరుకుంది.

"ఇబ్బడ లేదా?" అనడిగింది సుధారాణి ఆమె వచ్చి తన సీటులో కూర్చుంటూంటే.

"లేదు"

"రిపోర్టు చేయలేదా?"

"లేదు"

"ఎందుకని?"

ఇందిర ముఖంఎత్తి ఆమె వంక వాడిగా చూసింది. ఏంటో అనాలనుకుంది. కాని "కొన్ని కొన్ని పనులు చెయ్యా లేం అంతే" అని మాత్రం అనగల్గింది.

సుధారాణి ఆమె సమాధానానికి మొదట ఆశ్చర్యపడి నట్లయిపోయి తర్వాత ముఖం ముడుచుకుంది.

రైలు కదిలింది.

*　　　*　　　*

ఇందిరకు కొంచం సిగ్గు తగ్గినట్లయింది. పాపతో ఆడు కోవటం మొదలుపెట్టింది. ఆ పాప పేరేమిటో తనకు తెలి యదు. తెలిస్తే బాగుండుననిపించింది. ఆ పాప స్పర్శలో, ఆ పాప నవ్వులో ఏదో దొరుకుతోందామెకు. బహుశా మన శ్శాంతి.

ఇందిర అనుకోకుండా పాపతో కలిసిపోతోంది.

అప్రయత్నంగా "నాకిలాంటి పాప వుంటే బాగుం డును" అనుకుంది.

అంతలో నవ్వు వచ్చింది. తనకు పాప లెలావుంటారు. అసలు బ్రహ్మచారిణే అనుకో. ఒకవేళ పెళ్ళయినా కానీ....

పోనీ "ఈ పాప నాదయితే బాగుండును" అనుకుంది.

నాదంటూ ఏముంది యీ భూమ్మీద? ఎవరున్నారు నాకు?

ఆమె కళ్ళలో నీళ్ళు నిలిచాయి. రఘు లేడు. జీవితం లేదు ఏమీ లేదు.

తాడేపల్లిగూడెం వచ్చింది. అతను రాలేదు.

మళ్ళీ రైలు కదిలింది.

ఏలూరు వచ్చింది. అతను రాలేదు.

రైలు కదిలింది.

చీకటి పడిపోయింది. రైలు కుదుపుకు పాపకు నిద్ర వచ్చింది. ఇందిరకు కూడా కునికిపాట్లు వచ్చాయి.

* * *

విజయవాడ స్టేషను వచ్చేసింది. ఇందిరకు భయంగా వుంది. గుండె దడదడమని కొట్టుకుంటోంది. పాప నెత్తుకుని దిగిప్లాట్‌ఫారం మీదకువచ్చింది. ఎక్కే, దిగే, తిరిగేజనంతో, పోర్టర్లతో అవీ ఇవీ అమ్ముకునేవాళ్ళ కేకలతో హడావుడిగా వుంది ప్లాట్‌ఫారం. అనుమానంతో అటూ ఇటూ చూసింది. లైసెన్సుకూలీ వచ్చి లగేజదింపాక. అతని వెంటనడిచి, ప్లాట్‌ఫారందాటి బయటకు వచ్చింది.

* * *

అయిదేళ్ళు గడిచిపోయాయి.

ఆ యింట్లో యిప్పుడు తనూ, పాపా తప్ప ఎవరూ లేరు.

ఆమె రఘుని మరిచిపోయింది. ఆ మొండితనంలో పాపపన్నీటి జల్లులా వుంది.

ఉదయమే పాప లేస్తుంది. చిన్న టూత్ బ్రష్‌తో చక్కా ముఖం కడిగేసుకుంటుంది. మమ్మీతో కాసేపు కబుర్లుచెప్పి స్నానంచేసి, బ్లూ యూనిఫారం వేసుకుని కాన్వెంట్‌కు వెళ్ళిపోతుంది.

ఇందిర కాలేజికి వెళ్ళిపోతుంది.

సాయంత్రం మళ్ళీ యిద్దరూ కలుసుకుంటారు. ఎన్ని కబుర్లు చెప్పుకుంటారని! ఎన్ని ఆటలాడుకుంటారో; తరుచు తన కార్లో పాపని షికారు తీసుకెడుతుంది. ఇద్దరూ తిరిగి తిరిగి అలిసిపోయిన ముఖాలతో యింటికి తిరిగివస్తారు. కలిసి డిన్నర్ తర్వాత ఒకే మంచంమీద నిద్ర.

పాపలేనిదే ఇందిరలేదు.

పాప ఇందిరలో కలిసిపోయింది.

ఒకరోజు సాయంత్రం అయిదయింది. ఇందిర తమ చిన్న బంగళా వరండాలో పాప కోసం ఎదురుచూస్తూ అటూ యిటూ తిరుగుతోంది.

బయట కారాగిన చప్పుడయింది. ఇందిర తలత్రిప్పి చూచేసరికి పాప కారుదిగి లోపలకు వస్తోంది.

"పాపాని యింతలో గేటు ప్రక్కనుంచి ఎవరో పిలిచారు.

పాప ఆగిపోయింది.

ప్రహరీగోడ ప్రక్కనుండి ఒక వ్యక్తి నడిచి ముందుకు వచ్చాడు. బక్కపలుచగా నీరసంగా వున్నాడు. కళ్లుతీక్షణంగా మెరుస్తున్నాయి.

పాపకు భయంలేదు. "ఎవరు....నువ్వు....?" అనడిగింది. చిన్న పెదవులు కదలిస్తూ.

"నేను—నేను మీ నాన్నని పాపా !"

"అబద్ధాలు....నాకు మమ్మీయేగాని....డాడీలేడు."

"నిజం పాపా. నేనే మీ నాన్నని. నీ కోసంవచ్చాను ఆ వ్యక్తి యింకా దగ్గరకు వచ్చాడు.

"ఊహు.... నేన్నమ్మను"

"అవును పాపా, అయిదేళ్ళక్రితం కొన్ని కారణాలవల్ల నిన్ను రైల్లో ఆమె రక్షణకు వదిలేసి పారిపోయాను. పరిస్థితి కలిసిరావటానికి యిన్నాళ్ళు పట్టింది. ఇహ మనిద్దర్నీ ఎవరూ వేరుచేయలేరు రా పాపా. రా. ఇక్కడ్నుంచి వెళ్ళిపోదాం పద."

'వీల్లేదు' పాప ఎంతసేపటికి గేటుదగ్గర్నుంచి కదలిరాక పోయేసరికి ఏం జరిగిందో చూద్దామని అక్కడికి వచ్చిన ఇందిర అంతావిని గట్టిగా అరిచింది.

"ఎందుకు వీల్లేదు ?" ఆ వ్యక్తి కటువుగా అన్నాడు?

"ఆనాడు రైలులో పాపని యెప్పుడైతే నాపరం చేసి వెళ్ళావో అప్పుడే నువ్వామెమీద హక్కుని కోల్పోయావు. పాపకు నేనేం చేశానో తెలీదుగాని అది నాకు జీవం ఇచ్చింది. పాప నాఊపిరి. నా సర్వస్వం. పాప నాది" ఇందిర ఆవేశంగా అంది.

"ఈ అయిదేళ్ళూ మీరు దాన్ని కాపాడి నందుకు నా కృతజ్ఞతలు. మీరు అలా కాపాడగలరని ఊహించే మీ చేతుల్లో వదిలి వెళ్ళాను. కాని యిప్పుడు నేను సేచ్ఛాజీవిని.

నా పాపని నేను పెంచుకోగలను. రా అమ్మా వచ్చెయ్ నా దగ్గరకు"

"నేను రాను" పాప ఇందిర దగ్గరకు పరిగెత్తింది.

"పాపా ! అంతగా అయితే అప్పుడప్పుడు యిక్కడికి వద్దువుగానిలే. నిన్ను విడిచి నేను ఇహ ఒక క్షణంకూడా వుండలేను. రా వచ్చెయ్" అతను ఒక అడుగు ముందుకు వేశాడు.

పాప ఇందిర చాటున దాక్కుంది.

ఇందిరకు దుఃఖం ఆగలేదు ! గుండె పగిలిపోతున్నది. "చూడండి. మీరెవరో నాకు తెలియదు. అప్పుడు నా మీద కనికరించి దీన్ని నా చేతుల్లో వదిలిపెట్టి వెళ్ళారు. ఏదో వెలుగు కనిపించసాగింది. అప్పట్నుంచీ ఆ వెలుగుని ఆర్పేయకండి. ఆ దీపాన్ని తీసివేయకండి, మీకేం కావాలో చెప్పండి పాపతప్ప. నా యావదాస్తి మీకు ధారపోస్తాను. మీ పాదాలు పట్టుకుని ప్రాధేయపడతాను. ప్లీజ్. పాపను నాకు దక్కేటట్లు చేయండి"

"ఐయామ్‌సారీ" అతను కర్కశంగా అని ఆమెను ప్రక్కకు త్రోసి పాపని చెయ్యి పట్టుకుని లాగుతున్నాడు.

"మమ్మీ ! మమ్మీ" అని ఏడుస్తోంది పాప.

"వదలండి, నా పాపని వదలండి" అని ఇందిర అరుస్తోంది. ఏడుస్తోంది. ఆవ్యక్తి కదల్లేదు. పాపని బలవంతంగా రెండు చేతుల్లో ఎత్తుకుని, బుజంమీద వేసుకుని వెళ్ళిపోతున్నాడు.

ఇందిర కెవ్వుమని అరచి స్పృహ తప్పి పడిపోయింది.

*　　　*　　　*

"ఏమండీ! బెజవాడ వచ్చేసింది లేవండీ" ఎవరిదో చెయ్యి బుజం తడుతూ లేపుతుండే సరికి ఇందిర ఉలికిపడి కళ్ళు విప్పింది. ప్రక్కనే సుధారాణి ముఖం కనిపించింది.

"ఏం జరిగింది? ఏలూరులో రైలుబయల్దేరాక ఏం జరిగింది?"

ఒడిలోని పాపవైపు చూసింది. నిర్మలంగా నిద్రపోతూంది.

ఆమెకు వెర్రి ఆవేశం వచ్చినట్లయింది. కళ్ళల్లో నీళ్ళు గిరున తిరుగుతున్నాయి.

"ఈ పాప నాది ఈ పాప నాది" అనుకుంటూ గుండెకు హత్తుకుంది.

"నా కెవరూ లేరని ఎందుకనుకోవాలి? పాప వుందిగా."

ఇందిర పాపతో లేచి నిలబడింది. సుధారాణి వంక తిరిగి 'వస్తాను' అన్నట్లు చూసింది.

సుధారాణి ఆమెనేదో అడుగుదామనుకుని ఇందాకటి జవాబు గుర్తువచ్చి తమాయించుకుని ఊరుకుంది.

ఇందిర పెట్టెదిగి క్రిందకు వచ్చింది. ఆమెకు ఏదో భయం. అక్కడ్నుంచి త్వరగా బయట పడాలని ఆరాటంగా వుంది. పోర్టరు వచ్చి ఆమె పెట్టె, బెడ్డింగూ బయటకు తీసి, నెత్తి మీద కెక్కించుకున్నాడు.

ఆమె ఒక్కసారి అటూ యిటూ చూసి త్వరత్వరగా అడుగులు వేస్తోంది.

"ఇన్నాళ్ళు మత్తుగా గడిపాను, ఏకాకిలా గడిపాను. శిలలాగడిపాను రఘు లేకపోతే నేం పాప వుంది. ఆ తోడు చాలు నాకు. చాలేమిటి ? ఎంతో ఎంతో ఎక్కువ.

పాపను దాచుకోవాలి.

పాపను పెంచుకోవాలి.

పాపను పంచుకోవాలి ! తనలో ఒక భాగంగా.

ఆమెలో దుఃఖావేశం, ఉద్విగ్నత. వెర్రి ఆనందం ముప్పిరిగొని ఆ జనసందోహంలోంచీ. ఆ కోలాహలంలోంచి, ఆ కిటకిటలోంచి బయటకు నడిపిస్తున్నాయి.

ఆమెకు చాలా ఆనందంగా వుంది. ఉద్రేకంగా ఉంది.

"ఏమండీ !"

ఆమె తృళ్ళిపడి ఆగింది.

ఎప్పుడో విన్న కంఠస్వరం. ఆమె నవనాడులూ కృంగి పోయినట్లున్నాయి.

అతను ఆమె ప్రక్కకు వచ్చి నిల్చున్నాడు. "మీరు నన్ను క్షమించాలి. చేతిలో డబ్బులేదు, పాపను నాతో వుంచుకోవటానికి జాగాలేదు. చాలా బాధ పడివుంటారు .... మీరు చేసిన ఉపకారానికి చాలా థాంక్సండి"

నమ్రతగా అంటూ ఆమె భుజం మీద నుంచి పాపను తీసుకోవటానికి చేతులు జాచాడు.

ఎంతో చెప్పాలనుకుంది. అతనికి అర్థమయ్యేటట్లు వివరించుదామనుకుంది. వాదించుదామనుకుంది.

కానిస్థాణువులా నిలబడి చూస్తూ ఊరుకుంది.

అతను పాపని తీసుకున్నాడు. పొంగిపొర్లే ప్రేమతో పాప రెండు బుగ్గలమీదా ముద్దాడి "అర్జంటుగా వెళ్ళాలి నన్ను క్షమిస్తారు కదూ" అంటూ అక్కడ్నుంచి కదిలి జనంలో కలిసిపోయాడు.

శక్తి లేక, చేష్టలుడిగి, పెదవులతడి ఆరిపోతూండగా, నిర్ఘాంతపోతూ అలాగే నిలబడిపోయింది ఇందిర. ఇదంతా జరిగిందా ? అతను మోసంచేశాడా ? చేయలేదా ? ముందా ? తర్వాతా ? చేయడానికి ప్రయత్నించి మళ్ళీ మనస్సు మార్చుకున్నాడా ?

అంతా జనం ! జనం !! జనం !!!

ఆ జనం మధ్యలో వంటరిగా నిలబడిపోయింది ఇందిర.

—:—